ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 17 జనవరి 2025



నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు


"సంక్రాంతి కల్లా.. రోడ్లపై గోతులు ఉండవు. ఐదేళ్లుగా గ్రామీణులు దారులు, డ్రెయిన్లు లేక పడిన ఇబ్బందులు పరిష్కరిస్తాం. అని కూటమి ప్రభుత్వం పల్లెపండుగ పనులతో పాటు గోతులు లేని ఆర్‌అండ్‌బీ రోడ్లు అని లక్ష్యం నిర్దేశించుకుంది. అయితే రెండు నెలల క్రితం ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతి లక్ష్యం దిశగా ఆరంభంలో ఆయా పనులు సాగాయి. కానీ అధికారుల్లో నిర్లక్ష్యం.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటికి సగం పనులు కూడా పూర్తి కాలేదు. సరైన రోడ్లు, డ్రెయిన్లు లేక గత ఐదేళ్లు ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను సంక్రాంతి నాటికి పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. గ్రామసభలను నిర్వహించి పల్లెపండుగకు కార్యాచరణ ఇచ్చినా.. ఆర్‌అండ్‌బీ రోడ్లపై గోతులు ఉండకూడదని ప్రత్యేకంగా నిధులు విడుదల చేసినా.. ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంక్రాంతి పండుగ వచ్చింది.. అయినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పల్లెపండుగతో పాటు గోతులు లేని రోడ్ల పనులు నత్తే నయం అన్నట్లుగా సాగాయి. ప్రభుత్వం సంక్రాంతి లక్ష్యం నిర్దేశించగా.. అధికారులు ఏ సంక్రాంతి అనుకున్నారో అంటూ ప్రజలు ప్రస్తుతం సాగుతున్న పనులపై వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు."

లక్ష్యం.. నిర్లక్ష్యం

- నిలిచిన పల్లెపండుగ పనులు
- గ్రామాల్లో 43.85 శాతం పనులే పూర్తి
- బిల్లుల చెల్లింపుల్లో నెల రోజులుగా జాప్యం
- నత్తతో పోటీ పడుతోన్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- రెండు నెలలుగా 50 శాతం గోతులనే పూడ్చారు
- జిల్లాకు రూ.13 కోట్లు నిధులిచ్చినా పనుల్లో నీరసమే

జిల్లా	చేపట్టిన పనులు	పూర్తిచేసిన పనులు	పనుల శాతం
పల్నాడు	521	238	45.68
బాపట్ల	640	298	45.57
గుంటూరు	167	69	40.35

ఆర్‌అండ్‌బీ.. మరమత్తు



గుంతలమయంగా ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకి గోతులు లేని రోడ్లు చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు తగ్గట్లుగా రోడ్లపై గోతులు పూడ్చేందుకు జిల్లాకు రూ.13 కోట్లు పై చిలుకు నిధులు కేటాయించింది. అయినా రోడ్లు, భవనాలు శాఖ అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచారు. సంక్రాంతి నాటికి 100 శాతం పూర్తి కావాల్సిన పనులను కేవలం సగం మాత్రమే పూర్తి చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు అధ్వానంగా మారాయి. గోతుల రోడ్లపై వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గోతుల్లో పడి పలువురు మృతి చెందగా వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మారారు. అయినా నాటి పాలకుల్లో రోడ్లపై గుంతలు పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చడంపై దృష్టి సారించింది. ఆయా రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిధులను వెంటనే ఖర్చు చేసి రోడ్లు బాగు చెయ్యాలని ప్రభుత్వం ఆదేశించింది. జనవరి 14 నాటికి పూర్తిగా మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చిన చోట అసిస్టెంట్ ఇంజనీర్లు ఫొటోలు దిగి యాప్‌లో అప్ లోడ్ చెయ్యాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే అధికారుల్లో నిర్లక్ష్యం కారణంగా సంక్రాంతి పండుగ వెళ్లిపోయినా ఆయా పనుల్లో జాప్యం జరుగుతోంది.

కొందరికే పనులతోనే సమస్య..

గోతుల పనులు త్వరగా పూర్తి కావాలంటే ఎక్కువ మంది కాంట్రాక్టర్లకు కేటాయించాలి. గుంటూరు జిల్లాలో మాత్రం మొత్తం పనులన్నీ అతి తక్కువ మంది కాంట్రాక్టర్లకు కేటాయించారు. ఒక్కొక్కరికి ఐదారు పనులు కేటాయించారు. ఆ కొద్దిమంది కాంట్రాక్టర్లు అన్ని పనులు సకాలంలో పూర్తి చేయలేక పోయారు. కాంట్రాక్టర్లు ఒక పని ముగిసిన తర్వాత మరో పని మొదలు పెడుతున్నారు. దీంతో ఇప్పటికీ మూడు జిల్లాల పరిధిలో సగం మాత్రమే పనులు పూర్తి అయినట్లు అర్థమవుతోంది.

మేరికపూడి కూలీలు వస్తేనే..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ పనులన్నీ కేవలం ఫిరంగిపురం మండలంలోని మేరికపూడి కూలీల మీదే ఆధారపడి జరుగుతుంటాయి. వారు లేకపోతే రోడ్ల పనులు జరగడంలేదు. గత నెలలో సెలవులు, పండుగలు ఎక్కువ రావడంతో సదరు కూలీలు పనులకు రాలేదు. దీంతో కూలీల సమస్యతో పనుల్లో జాప్యం నెలకొంది. ఆ గ్రామానికి చెందిన కూలీలు వచ్చే వరకు అన్ని గ్రామాల్లో పనులు ఆగిపోతున్నాయి. పట్టణాల్లో చాలా వరకు రోడ్లు బాగు చేసినా గ్రామాల పరిధిలో ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్తిపాడు-గొట్టిపాడు, నల్లపాడు-బైపాస్ తదితర ప్రాంతాల్లో ఇంకా పనులు ప్రారంభమే కాలేదు. ఆయా రోడ్లలో ప్రయాణం ఇప్పటికీ నరకాన్ని తలపిస్తూనే ఉంది.

ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిధులు జమ చేస్తోంది. నవంబరు నుంచి ఇప్పటివరకు చేసిన పనుల కు రూ.7 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమయ్యాయి. సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుగుతున్నా పనులు చేయించడంలో అధికారుల్లో నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి కాని పనులు కేవలం 10 రోజుల్లో (జనవరి 26 నాటికి) పూర్తి చేస్తామని అధికారులు చెప్తున్నారు.



నెలాఖరులోగా పూర్తి చేస్తాం

రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. ఆర్‌అండ్‌బీలో కొందరు మాత్రమే కాంట్రాక్టర్లు ఉన్నారు. అందువల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. దానిని అధిగమించి ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

- సీ విశ్వనాథరెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ, గుంటూరు

నిధులు.. నై

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో రెండు నెలల క్రితం పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించినట్లుగా పల్లె పండుగ పనులు సంక్రాంతి పండుగకు పూర్తి కాలేదు. పూర్తైన పనులకు నెలరోజులుగా బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.కోట్లల్లో బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడంతో గ్రామాభివృద్ధి కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పథకం ప్రారంభంలో వారం.. వారం బిల్లుల చెల్లింపులు జరగడంతో పనులు వేగంగా జరిగాయి. రెండు వారాల తర్వాత బిల్లుల చెల్లింపులు జరగక ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి.

నాడు ప్రభుత్వం.. నేడు అధికారుల నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కనీసం రోడ్లు, మురుగుకాల్వలు వంటి మౌలిక సదుపాయలు కల్పించలేదు. దీంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించింది. సత్వరం చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి పంచాయతీ తీర్మానాల ద్వారా ప్రతిపాదనలను అధి కారులు రూపొందించారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చే పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. అయితే చేపట్టిన పనుల్లో సగం కూడా పూర్తి కాలేదు. పనులను కాంట్రాక్టుపై కాకుండా నామినేషన్ విధానంలో చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సూచించిన వ్యక్తుల చేత పనులు చేపట్టారు. కాగా పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. త్వరలోనే బిల్లుల చెల్లింపు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

సగం పనులే పూర్తి..

గుంటూరు జిల్లాలో 132 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారుల బాగుకు రూ.487.90 లక్షలు, 420.467 కిలోమీటర్ల మేర మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల బాగుకు రూ.848.90 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. అయితే ఇప్పటికి మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 175 కిలోమీటర్లు, రాష్ట్ర రహదారులు 72 కిలోమీటర్లు మాత్రమే బాగు చేశారు. ఇంకా సగం పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆర్‌అండ్‌బీ లెక్కలు చెప్తున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పల్లెపండుగలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికి 43.85 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు డ్వామా శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

పల్లెల్లో పనులు ఇలా..

- పల్నాడు జిల్లాలో రూ.62.54 కోట్లతో గ్రామాల్లో రహదారులు, మురుగు కాల్వలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు చేపట్టారు. 521 పనులు చేపట్టగా ఇప్పటికి 238 పనులు మాత్రమే పూర్తి చేశారు. 70,436 మీటర్ల మేర రోడ్లు, 9,118 మీటర్లలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టారు.
- బాపట్ల జిల్లాలో 640 పనులను రూ.67.58 కోట్లతో చేపట్టగా ఇప్పటికి 298 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 1,20,964 మీటర్ల మేర రోడ్లు, 1,176 మీటర్ల మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు.
- గుంటూరు జిల్లాలో 167 పనులను రూ.14.54 కోట్లతో చేపట్టగా ఇప్పటికి 69 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 26,754 మీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టారు.





నిర్మాణంలో ఉన్న మురుగు కాల్వలు



నిర్మాణ దశలో సీసీ రోడ్డు

గౌరవం సరే.. వేతనం?



- గౌరవ వేతనం కోసం సర్పంచ్‌ల నిరీక్షణ
- నెలకు రూ.3 వేలు.. పది నెలలుగా పెండింగ్
- ముఖ్యమంత్రి ఆదేశాలను పట్టించుకోని అధికారులు

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడుపు చించుకుంటే కాళ్ల మీద పడినట్లుగా ప్రస్తుతం సర్పంచ్‌ల పరిస్థితి నెలకొంది. గత పది నెలలుగా గౌరవ వేతనం అందక గ్రామాల్లోని ప్రథమ పౌరులైన సర్పంచ్‌లు అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో తగిన గౌరవం దక్కుతుందన్న ఆనందం.. వేతనం అందలేదన్న బాధతో ఆవిరి అవుతుందని వాపోతున్నారు. తమ దగ్గర పనిచేసే ఉద్యోగులకు జీతాలు అందక పోతే వారితో, వీరితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నాం.. అదే తమకే వేతనం రాక పోతే ఎవరికి చెప్పుకోవాలని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి గౌరవం వేతనం బకాయి ఉంది. గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519, బాపట్ల జిల్లాలో 426 మంది సర్పంచ్‌లు ఉన్నారు. వారికి నెలకు ప్రభుత్వం గౌరవ వేతనం కింద రూ.3 వేల వరకు చెల్లిస్తుంది. గత ప్రభుత్వం ఈ మొత్తం చెల్లించేందుకు కూడా సర్పంచ్‌లను ముప్పతిప్పలు పెట్టింది. దానికోసం సర్పంచ్‌లు పలు సందర్భాల్లో రోడ్డెక్కాల్సి వచ్చింది. ఎన్నికల సమయంలో సర్పంచ్‌లు దూరం అవుతారన్న ఆలోచనతో అప్పటి వరకు ఉన్న బకాయిలను గత ఏడాది మార్చి నెలలో వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో వేతనాలు చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పరిపాలనా సంబంధిత వ్యవహారాల్లో సర్పంచ్‌లను కీలకమైన వారిగా ప్రకటించింది. గౌరవ వేతనం చెల్లింపులపై సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. చాలా మంది సర్పంచ్‌ల రోజువారీ ఖర్చులకు ఆ గౌరవ వేతనమే ఆధారమని చెబుతున్నారు.

వినతిపత్రం కూడా ఇచ్చాం..

"సర్పంచుల గౌరవ వేతనంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ సంయుక్త కార్యదర్శి కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని ఇచ్చాం. తప్పకుండా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు క్రమం తప్పకుండా ప్రతి నెల నిధులు విడుదలకు కృషి చేయాలి."

- డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ముఖ్య సలహాదారు, ఏపీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం

వెంటనే విడుదల చేయాలి

"పది నెలలుగా గౌరవ వేతనం రాకపోవడం బాధాకరం. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలి."

- మబ్బు శిరీష, సర్పంచ్, జొన్నలగడ్డ, గుంటూరు రూరల్

ధర.. దిగాలు



- మిర్చి క్వింటాల్ రూ.13 వేలు
- ఏడాదిగా మిర్చి ధరలు పతనం
- దిగుబడులున్నా పెట్టుబడి రాని దుస్థితి
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజ్‌ల్లో లక్షల టిక్కీల నిల్వ
- 20వ తేదీ నుంచి యార్డులో కొనుగోళ్లు ప్రారంభం

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఘాటు ధరలో లోపించింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఏడాదిగా మిర్చి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. ఒకప్పుడు మిర్చి పండించి లాభాలు గడించిన రైతులు ఆ సాగును వీడలేక.. ఎప్పటికైనా ధర పెరగకపోతుందా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఏడాదిగా పరిస్థితిలో మార్పు రాకపోగా మరింతగా ధరలు దిగజారిపోతున్నాయి. గత ఏడాది జనవరి నుంచి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాధారణంగా సీజన్ ఆరంభంలో మంచి ధర పలికే ఆనవాయితీ కూడా ఈసారి తప్పింది. ఎగుమతి ఆర్డర్లు తగ్గడం, ఆయా రాష్ట్రాల్లో కూడా వెరైటీలు బాగా పండడంతో మిర్చి ధర పతనం అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది గుంటూరు మిర్చి యార్డుకు తెచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు లక్షలాది టిక్కీలు కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేశారు. ఏడాది పొడవునా ఒకే ధర ఉండడంతో వాటిని మధ్యలో అమ్మే ప్రయత్నం చేయలేదు. ఈ క్రమంలో సోమవారం నుంచి గుంటూరు మిర్చి యార్డులో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ ఒక్కరోజే సుమారు 80 వేల టిక్కీలు అమ్మకానికి వస్తాయని యార్డు అధికారులు అంచనా వేస్తున్నారు. పాత పంట లక్షల టిక్కీలు పేరుకుని పోతే, కొత్త పంట ధర విషయంలో పెద్దగా డిమాండ్ ఉండకపోవచ్చని వ్యాపారులు అంటున్నారు. గుంటూరు మిర్చి యార్డులో ప్రస్తుతం కామన్ వెరైటీగా చెప్పే 334, నెంబరు 5,273, గుంటూరు సన్నం, సూపర్ 10,341 కనిష్ఠ ధర రూ.7 వేలు, గరిష్ఠ ధర రూ.19 వేలు ఉంది. అయితే రూ.13 వేలకు మించి కొనుగోలు జరగడం లేదు. స్పెషల్ వెరైటీగా చెప్పబడే తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ కనిష్ఠ ధర రూ.7500, గరిష్ఠ ధర రూ.20700 ఉండగా రూ.15 వేలకు మించి కొనుగోలు జరగడం లేదని సమాచారం.

తగ్గిన సాగు.. పెరిగిన పెట్టుబడి

గత ఏడాది పెద్దగా మిర్చికి ధర లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది మిర్చి

(మిగతా 7వ పేజీలో)



తాగునీరు వృథా

- పైపులైన్లలో లీకులే లీకులు
- కలుషితమవుతున్న రక్షిత నీరు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు



రావిపాడు రోడ్డులోని శివాలయం సెంటర్‌లో పైపులైన్‌పై భారీ లీకు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పైపులైన్లకు లీకులు.. తాగునీరు వృథా.. సురక్షిత నీరు కలుషితం.. అయినా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. నరసరావుపేట మున్సిపాల్టీలో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. రావిపాడు రోడ్డులోని పైపులైన్‌పై ఏర్పడిన లీకుల ద్వారా రక్షిత నీరు మార్జిన్లలో సాగునీటి కాల్వలను తలపిస్తూ ప్రవహిస్తుంది. శాంతినగర్ వద్ద ఉన్న నీటి శుద్ధి ప్లాంట్ నుంచి పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు ఎక్కించే పైపులైన్‌పై లీకులు ఏర్పడ్డాయి. కొన్ని లీకులు ఏడాదిగా ఉన్నట్లు ఆ ప్రాంతవాసులు తెలిపారు. సరఫరా సమయంలో లీకుల ద్వారా పెద్దఎత్తున నీరు వృథా అవుతుంది. నీటి సరఫరా లేని సమయంలో అదే లీకుల నుంచి మట్టి నీరు పైపుల్లోకి వెళుతుంది. దీంతో తాగునీరు కలుషితం అవుతోంది. లీకుల పూడ్చివేత గురించి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పట్టించుకోవడంలేదు. ఇటీవలే రావిపాడు రోడ్డులో పలు ప్రాంతాల్లో పైపులైన్‌పై ఉన్న లీకులను పూడ్చి వేశారు. అయినా మళ్లీ అదే ప్రాంతంలో పైపులైన్ లీకులు ఏర్పడ్డాయి. శాంతినగర్‌లోని నీటిశుద్ధి ప్లాంట్ నుంచి సరఫరా చేసే నీటిని ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎక్కించేందుకు మోటార్లను వినియోగిస్తున్నారు. మోటార్ల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పైపులైన్‌పై వత్తిడి పెరిగి లీకులు ఏర్పడుతున్నట్లు సమాచారం. నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నీటి సరఫరాలో లోపాలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.



రావిపాడు రోడ్డులోకి కలప షాపు వద్ద ఏడాదిగా పైపులైన్‌పై భారీ లీకు

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
గుంటూరు ● శుక్రవారం 17 జనవరి 2025

సినిమాలో నా లుక్ తృప్తినిచ్చింది

- జగపతిబాబు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్). నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో తన లుక్ గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సినిమా కోసం సన్నద్ధమవుతున్న వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "చాలా కాలం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సీ 16' కోసం మంచి పాత్రను ఇచ్చాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా ఉంది" అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.






షాక్‌కు గురయ్యాం

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై టాలీవుడ్ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి షాక్‌కు గురయ్యామన్నారు. 'సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి నన్నెంతగానో కలచి వేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'సైఫ్ సర్‌పై జరిగిన దాడి గురించి విని షాక్‌కు గురయ్యాను. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. కాగా, ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించారు సైఫ్ అలీఖాన్. గతేడాది విడుదలైన ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర-2' ప్రారంభం కావాల్సి ఉంది. సైఫ్ దాడికి గురికావడంతో ఇది మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

అందుకే సినిమాలు తగ్గించా

బ్రహ్మానందం



'సినిమాలు ఎందుకు తగ్గించేశానని చాలా మంది అడుగుతున్నారు. నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని కాపాడుకోవాలి. బ్రహ్మానందం బాగానే చేస్తున్నాడు కానీ.. ఒకప్పటిలా బాగా నవ్వించలేకపోతున్నాడు. ఆయన ఒకప్పుడు నటిస్తే వచ్చినంత నవ్వు ఇప్పుడు రావట్లేదు' అని కొందరు కమెడియన్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఎంత జాగ్రత్తగా చేసినా ఇలా దొరికిపోతుంటాం. ఇలాంటివి అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమాలు సెలక్టివ్‌గా చేస్తున్నాను. దర్శకులు కూడా నేను ఇదివరకు చేసిన పాత్రలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. నన్ను ప్రేక్షకులు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే రిపీట్ పాత్రలు చేయకూడదు. మరో కారణం, పెరుగుతున్న నా వయసు. ఒకప్పుడు చేసినంత ఉత్సాహంగా చేయలేకపోతున్నాను. అందుకే సినిమాలు తగ్గించేయాలని నిర్ణయం తీసుకున్నాను. నాకు సినిమాల్లో అవకాశాలు రాకా కాదు. దర్శకులు నాకు పాత్రలు ఇవ్వకా కాదు. నేను యాక్టింగ్ చేయలేకా కాదు" అని 'బ్రహ్మా ఆనందం' టీజర్ లాంచ్ కార్యక్రమంలో బ్రహ్మానందం చెప్పారు. తన తనయుడు రాజా గౌతమ్‌తో కలసి ఆయన నటించిన చిత్రమిది. ఆర్.వీ.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్‌యాదవ్ నక్కిన నిర్మించారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.



నిజ జీవిత ఘటనల ఆధారంగా...

అక్షయ్ హీరోగా దినేశ్ బాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య కీలకపాత్రల్లో నటించారు. పి.ఎన్.బలరామ్ నిర్మాత. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ప్రతీ షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది' అని అన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం' అని అన్నారు. కాగా, మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ని ఎంపిక చేసి రూ.10,000 క్యాష్ బాక్ బహుమతిగా అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

సంక్రాంతి సినిమా ఫిబ్రవరిలో వస్తోంది



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్ నటించిన 62వ చిత్రం 'విడాముయర్చి' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించిన మేకర్స్ గురువారం సాయంత్రం ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజ్ చేయనున్నారు. మగిళ్ తిరుమేని దర్శకుడు. త్రిష హీరోయిన్. సీనియర్ నటుడు అర్జున్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా, రెజీనా కెసాండ్రా మరో ముఖ్య పాత్రలో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ మూవీని లైకా ప్రొడక్షన్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇక ఈ ట్రైలర్‌లో 'అజిత్, త్రిష ప్రేమని చూపించి, ఆ తర్వాత వీళ్ళకు ఒక సమస్య ఉత్పన్నం కాగా దానిపై హీరో ఎలా పోరాడాడు అన్నది 2 నిమిషాల 22 సెకన్లతో ఈ ట్రైలర్‌ను కట్ చేశారు. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు ఇది రీమేక్‌గా చెబుతున్నారు. నిజానికి సంక్రాంతి పండుగకు రిలీజ్ కావాల్సి ఉండగా, హాలీవుడ్ రీమేక్ హక్కులు పొందడంలో తలెత్తిన సమస్యల కారణంగా వాయిదా వేశారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

మా కుటుంబంలో గొడవలు దురదృష్టకరం



తమ కుటుంబంలో గొడవలు జరగడం దురదృష్టకరమని మంచు మనోజ్ అన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తన భార్య భూమా మౌనికతో కలసి మనోజ్ వచ్చారు. బుధవారం ఎంబీయూ విద్యాసంస్థల వద్ద జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సినిమాలకు 8 సంవత్సరాలు దూరంగా ఉన్నానని, ఇప్పటికీ తనకు అభిమానులు ఉండటం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తనపై అభిమానంతో ఉన్న వారిని బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఉంటే తనను పిలిపించి మాట్లాడుకోవాలే గానీ, తన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడం పద్ధతి కాదన్నారు. తన అభిమాని పళణి, వినాయకన్‌ను పిలిచి, తనతో తిరగకూడదని బెదిరించారని, పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొంటే గొడవలు సద్దుమణుగుతాయన్నారు. ఎంబీయూలో జరిగే క్యాంపస్ గురించి చర్చించుకొంటే సరిపోతుందన్నారు. మంచు విష్ణు అనుచరులైన హేమాద్రి, కిరణ్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)


దబిడి దిబిడి.. కళలో ఓ భాగమే

- ఊర్వశీ రౌతేలా



'బాలకృష్ణ గారు ఓ లెజెండ్. ఆయనతో కలసి పనిచేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తా' అని అన్నారు నటి ఊర్వశీ రౌతేలా. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ - ఊర్వశీ రౌతేలా 'దబిడి దిబిడి' పాట బాగా పాపులర్ అయ్యింది. అయితే ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ గారితో పనిచేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో గౌరవం ఇస్తారు. ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను' అని అన్నారు. కాగా, ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్‌పై కూడా ఊర్వశీ స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్‌కు ఘాటుగా బదులిచ్చారు.

ఆంధ్ర క్రికెట్ జట్టుకు బాపట్ల విద్యార్థి ఎంపిక


అబ్దుల్ సాద్ ఉనైస్

బాపట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అండర్ -14 ఆంధ్ర క్రికెట్ జట్టుకు బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్ ఎంపికయ్యారు. పలువురు క్రీడాకారులు, ప్రముఖులు విద్యార్థిని అభినందించారు. క్రీడారంగాన మరెన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -14 రాష్ట్ర టీమ్‌లో అబ్దుల్ సాద్‌కు అవకాశం దక్కటం అభినందనీయమని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అబ్దుల్ సాద్ ఉనైస్ గతనెలలో జరిగిన అండర్ -14 జిల్లా స్థాయి ఎంపికలో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా టీమ్‌లో ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యారు. కృష్ణా, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, అనంతపూర్, విశాఖపట్నం జిల్లాల్లో జరిగిన పోటీలలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన అబ్దుల్ సాద్ రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. వివిధ జిల్లాలలో జరిగిన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో విశేషమైన ప్రతిభ కనబరిచారు. ఉత్తమప్రతిభ కనబరిచిన 60మంది క్రీడాకారులలో అబ్దుల్ సాద్‌కు అవకాశం దక్కింది. చివరిగా విజయనగంలో జరిగిన జోనల్ పోటీలలో 17మందితో కూడిన ఆంధ్ర అండర్ -14 క్రికెట్ టీమ్ జట్టు ఎంపిక చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అబ్దుల్ సాద్‌ను తీర్చిదిద్దటంలో కృషి చేసిన కోచ్ అమీర్‌ను పలువురు అభినందించారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం జరిగిన అభినందన సభలో పలువురు క్రీడాకారులు పాల్గొని అబ్దుల్‌సాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దొప్పలపూడి రామ్మోహనరావు, బి.స్టానీల్, విమల్‌కుమార్, రవికుమార్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ డైరెక్టర్ అబ్దుల్ కరీం, అంబటి గిరిధర్, మిరియాల సుబ్బారావు, తూనుగుంట్ల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పొరుగుసేవల ఉద్యోగులకు బదిలీల పొగ

- కొత్త సర్కిల్ ఆఫీసులకు పంపేలా ఉత్తర్వులు
- జాబితాలను సిద్ధం చేసిన ఎస్ఈ కార్యాలయాలు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్) లిమిటెడ్ సంస్థలోని పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏకంగా ఒక సర్కిల్ కార్యాలయం నుంచి కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీలు చేయాలన్న ఉత్తర్వులు వారిలో పిడుగుపాటుకు గురిచేస్తోంది. తాజాగా సీపీడీసీఎల్ సీఎండీ పటాన్‌శెట్టి రవి ఆదేశాలు ఉద్యోగుల్లో కలవరానికి గురిచేస్తోంది. బదిలీల ప్రక్రియను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సీపీడీసీఎల్ పరిధిలో ఉమ్మడి గుంటూరు సర్కిల్‌ను పల్నాడు సర్కిల్, బాపట్ల సర్కిల్‌గా విభజించిన విషయం తెలిసిందే. అటు కృష్ణా జిల్లాలోనూ మచిలీపట్నం కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. కాగా గుంటూరు సర్కిల్‌ను కొత్తగా విభజించిన పల్నాడు, బాపట్ల సర్కిల్ కార్యాలయాలకు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇప్పటికే సర్కిల్స్‌కు ఎస్ఈలను, ఈఈలను నియమించిన యంత్రాంగంగా కొత్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పాత సర్కిల్ కార్యాలయాల నుంచి కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 31 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే ఇందులో 17 మంది ఉద్యోగులను పల్నాడు సర్కిల్ కార్యాలయ కేంద్రం నరసరావుపేటకు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఇప్పటికే సర్కిల్ కార్యాలయం యంత్రాంగం బదిలీ జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇక కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్‌కు కూడా ఒంగోలు సర్కిల్ కార్యాలయం నుంచి ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దాంతో ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో 33 మంది ఉద్యోగులు ఉంటే వారిలో 13 మందిని బాపట్లకు బదిలీ చేయాలని జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. విజయవాడ సర్కిల్ కార్యాలయంలో 20 మంది ఉద్యోగులు ఉంటే వారిలో 8 మందితో బదిలీ జాబితాలో చేర్చినట్లు ఆశాఖ వర్గాలు చెబుతున్నాయి.

చాలీచాలని జీతాలతో ఎలా..

అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బదిలీల జాబితాలో చేర్చటం అన్యాయమంటూ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి సాధారణ బదిలీల సమయాల్లో రెగ్యులర్ ఉద్యోగులకే బదిలీల ప్రక్రియ ఉంటుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల విధానమే ఉండదని వారు గుర్తుచేస్తున్నారు. కనీసం ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి కాకుండా ఏకంగా సర్కిల్ కార్యాలయాల నుంచి మరో సర్కిల్ కార్యాలయానికి బదిలీలు చేయటాన్ని వారు ఆక్షేపిస్తున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తుంటే జిల్లాలు దాటి ప్రయాణాలు చేయాలంటే వచ్చే జీతంలో సగం జీతం చార్జీలకే సరిపోతాయని వారు వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు దశాబ్దాలుగా పనిచేస్తోన్నా కనీస జీతాలు కూడా రావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా గుంటూరు సర్కిల్ కార్యాలయంలో బదిలీల జాబితాలో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉండటం విశేషం. మహిళా ఉద్యోగులు అత్యధికశాతం ఉండటంతో ఏం చేయాలో తెలియక సర్కిల్ అధికారులు మల్లగుల్లాలు పడుతోన్నారు.

సీఆర్‌డీఏ సర్కిల్ ఆవిర్భావ సమయంలో ప్రక్రియ ఇలా..

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఉమ్మడి గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు-2 డివిజన్, అమరావతి డివిజన్‌లను కలిపి కొత్తగా సీఆర్‌డీఏ సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సర్కిల్ కార్యాలయంలో పనిచేసేందుకు ఉద్యోగుల కోసం కొత్తగా నియామకాలను చేపట్టారు. ఇలా వేరొక సర్కిల్ నుంచి ఉద్యోగుల బదిలీల వ్యవహారం లేదని గుర్తుచేస్తున్నారు. డివిజన్ కార్యాలయాల్లో ఉన్న వారిని సర్దుబాటు చేసుకొని సర్కిల్ కార్యాలయానికి కొత్తగా ఉద్యోగులను నియమించుకున్నారని, అటువంటి ప్రక్రియ వదిలేసి వేరొక జిల్లా నుంచి సిబ్బందిని బదిలీ చేయటం సరికాదని ఆక్షేపిస్తున్నారు.

ఉత్కంఠభరితంగా మంగళగిరి ప్రీమియర్ లీగ్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నవులూరులోని అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఐదో రోజైన గురువారం మంగళగిరి-పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమ గోదావరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మంగళగిరి జట్టు 102 పరుగులకే ఆలౌటయింది. రక్షణ్ 47 బంతుల్లో 87 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తూర్పు గోదావరి-కృష్ణా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ టైగా ముగియడంతో సూపర్ ఓవర్‌తో ఫలితాన్ని తేల్చారు. కృష్ణా జిల్లా జట్టుపై 3 పరుగుల తేడాతో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. 33 బంతుల్లో 53 పరుగులు చేసిన జయంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, ఉషోదయ, మర్కోరోస్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

ధర.. దిగాలు

(5వ పేజీ తరువాయి)

సాగు తగ్గింది. గత ఏడాది 2,37,398 హెక్టార్లలో మిర్చి సాగు కాగా, ఈ ఏడాది కేవలం 1,45,713 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. కొన్ని తెగుళ్ల వచ్చినప్పటికీ ప్రస్తుతం పంట బాగానే ఉన్నది. దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. మిర్చి సాగు పెట్టుబడి ఏటేటా పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ2.30 లక్షలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 20 క్వింటాల్ దిగుబడి వస్తుందన్న అంచనాలో రైతులు ఉన్నారు. పూర్తిస్థాయిలో పంట చేతికి వచ్చేప్పటికి ఇదే ధరలు కొనసాగినా రైతులకు పెద్ద నష్టం వాటిల్లదు. కానీ ఒక వేళ ధరలు మరింత పతనమైతే మాత్రం ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు నష్టం వస్తుందన్న అంచనాలున్నాయి.

తెలంగాణలోనూ సాగు..

గుంటూరు జిల్లాలో పండించే తేజ వెరైటీకే ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంటోంది. ఘాటు ఎక్కువగా ఇష్టపడే ముస్లిం దేశాలకు, దక్షిణ చైనాకి గుంటూరు మిర్చి ఎగుమతి అవుతుంది. గుంటూరు జిల్లాలో పండిస్తున్న తేజ వెరైటీలో ఘాటు 70 వేల నుంచి 80 వేల యూనిట్స్ వరకు ఉంటుంది. ఈ రకం ఎక్కువగా పండించేందుకు ఈ నేల అనువుగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వచ్చేది. అయితే నాలుగేళ్లగా ఇదే పంటను తెలంగాణలో కూడా సాగు చేస్తున్నారు. ఖమ్మం, మధిర ప్రాంతాల్లో పండుతున్న మిర్చిని ఎక్కువగా బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తున్నారు. దీంతో గుంటూరు యార్డు నుంచి ఆర్డర్లు తగ్గాయి. అంతర్జాతీయగా కూడా మిర్చి సాగు పెరిగిందని ఈ క్రమంలో ధరలు పతనమవుతున్నట్లు తెలుస్తోంది.

యువ క్రికెటర్ నితీష్‌కు మంత్రి లోకేశ్ అభినందన


నితీష్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ సీరీస్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్‌రెడ్డిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఉండవల్లి కరకట్ట వెంబడి వున్న నివాసంలో గురువారం రాత్రి నితీష్‌కుమార్‌రెడ్డి మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలుగువాడి సత్తా చాటిన నితీష్‌ను మంత్రి లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో యువ ఔత్సాహిక క్రీడాకారులకు నితీష్ స్ఫూర్తిగా నిలిచారని లోకేశ్ ఈ సందర్భంగా అన్నారు. అనంతరం ఆయన నితీష్‌ను చేనేత శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా నితీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీ చాలా బాగుందని చెప్పారు. ఈ పాలసీలో క్రికెట్‌ను కూడా చేర్చి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. నితీష్ ఈ సూచనపై లోకేశ్ సానుకూలంగా స్పందించారు. నితీష్ వెంట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కలెక్షన్ మేనేజర్ మృతి


వెంకట రాజేష్(ఫైల్)

నాదెండ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు - కర్నూలు రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌బీఐ కలెక్షన్ మేనేజరుగా పని చేస్తున్న మన్నెం వెంకట రాజేష్(47) మృతి చెందాడు. నాదెండ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నగరంలోని వెంగయ్య నగర్ 3వ లైన్‌కు చెందిన మన్నెం వెంకట రాజేష్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కలెక్షన్ మేనేజరుగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా క్రెడిట్ కార్డు ఏజెన్సీ టీమ్ లీడరుగా పని చేస్తున్న నవీన్‌తో కలిసి బ్యాంక్ పనుల నిమిత్తం మోటారు బైక్‌పై గుంటూరు బయలుదేరారు. నవీన్ వాహనం నడుపుతుండగా వెంకట రాజేష్ వెనుక కూర్చున్నాడు. సాతులూరు గ్రామ పరిధిలోని హోసన్న ప్రార్థనా మందిరం సమీపంలోకి వచ్చేటప్పటికీ వారి ద్విచక్ర వాహనానికి గేదె అడ్డం వచ్చింది. గేదెను తప్పించేందుకు వాహనాన్ని పక్కకు తిప్పగా గుంటూరు నుంచి నరసరావుపేట వైపునకు వెళ్లే కారు వెనుక నుంచి వారి వాహనాన్ని ఢీకొట్టింది. కొంత దూరం వారి వాహనాన్ని కారు ఈడ్చుకు పోయింది. వెనుక కూర్చున్న వెంకట రాజేష్ తీవ్రంగా గాయ పడ్డాడు. చికిత్స కోసం నరసరావుపేట తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రాజేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మేనల్లుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

- ప్రతి ఒక్కరూ వాటిని అనుసరించాల్సిందే
- తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు


చంద్రశేఖర స్వామి ఆలయాన్ని దర్శించిన తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

పెదకాకాని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి అని తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తెలిపారు. గత నాలుగు రోజులుగా తక్కెళ్ళపాడులో జరుగుతున్న శ్రీచంద్రశేఖర స్వామి ఆర్ద్ర మహోత్సవంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తొలుత చంద్రశేఖర స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో తెలుగువారి గొప్పదనం, విశిష్టతను అనేకమంది ఆయా దేశాలలో ఉన్న ప్రజలు అనుసరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాల లోపంతోనే ఆలయాల అభివృద్ధి జరగడం లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర్ ప్రసాద్, ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షల్లో గురువారం 238 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. 383 మంది హాజరవ్వగా, వారిలో 23 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 306 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది ఛాతీ, ఎత్తు తదితర కొలతలు సరిపోలేదు. మిగిలిన 283 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 41 మంది విఫలమయ్యారు. 242 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. ఒకరు పరుగు పోటీల్లో పాల్గొనలేదు. దీంతో 241 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 147 మంది అర్హత సాధించగా 95 మంది విఫలమయ్యారు. కాగా 242 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 236 మంది అర్హత సాధించగా 12 మంది విఫలమయ్యారు. మొత్తం 306 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 238 మంది అర్హత సాధించగా, 68 మంది విఫలమయ్యారు. పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్


మాట్లాడుతున్న జైళ్ల శాఖ జిల్లా అధికారి వీరేంద్రప్రసాద్

గురజాలటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌ను గురువారం జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జైలులోనే గడిపారు. కాగా జైళ్ల శాఖ జిల్లా అధికారి వీరేంద్రప్రసాద్ సబ్‌జైలు నుంచి బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సబ్‌జైల్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. జైల్‌లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నారని విలేకరులు అడుగగా అటువంటిదేమీ లేదని, అదంతా అవాస్తమని వీరేంద్రప్రసాద్ తెలిపారు.

ఏఎన్‌యూ పీజీ పరీక్షల తేదీల్లో మార్పులు

- 1, 3 సెమిస్టర్ పరీక్షలకు మారిన షెడ్యూల్
- పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు

పెదకాకాని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ, ప్రొఫెషనల్ కోర్సులకు నిర్వహించే పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు గురువారం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఆర్ట్స్ కోర్సులు, సైన్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ కోర్సులకు మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా, ఫిబ్రవరి 11వ తేదీ నుంచి జరుగుతాయని వెల్లడించారు. అలాగే ఈ నెల 27వ తేదీ నుంచి జరగాల్సిన 1వ సెమిస్టర్ ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ పరీక్షలు ఫిబ్రవరి 13వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయని తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష ఉండటంతో వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాల మేరకు మూడో సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేశామని వివరించారు. మూడో సెమిస్టర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ సమాచారాన్ని ఆయా కళాశాలలకు కూడా పంపుతున్నామని అలాగే యూనివర్సిటీ వెబ్సైట్ లో పొందుపరిచినట్లు వివరించారు.

ఏసు బోధనలు ప్రపంచ శాంతికి మార్గం


తురకపాలెంలో జేసు తిరు హృదయ స్వరూప ప్రతిష్ఠ చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ముప్పాళ్ళ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏసు బోధనలు ప్రపంచ శాంతికి మార్గాలని గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో జేసు తిరు హృదయ స్వరూప ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం జరిగింది. బిషప్ భాగ్యయ్య విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దివ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థల దాత, గ్రామ సర్పంచి మల్లవరపు చంద్రశేఖర్, స్వరూప దాత మద్దినేని శౌరయ్య, స్థానిక విచారణ గురువు ఫాదర్ ఎస్.చిన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు


తలపడుతున్న తమిళనాడు-పంజాబ్

ఈపూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కబడ్డీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు గురువారం రసవత్తరంగా సాగాయి. మొత్తం 50 జట్లు పాల్గొనగా లీగ్ దశకు పది జట్లు వచ్చాయి. లీగ్ దశలో పంజాబ్‌పైన తమిళనాడు, సత్తెనపల్లిపై కర్ణాటక, జీవీ యువసేనపై ఏపీ స్కై, ఝార్ఖండ్‌పై పంజాబ్, హర్యానాపై ఝార్ఖండ్ విజయం సాధించినట్లు కమిటీ నిర్వాహకులు సూరే కోటేశ్వరరావు, తల్లపనేని రామారావు తెలిపారు. శుక్రవారంతో పోటీలు ముగుస్తాయన్నారు.

ప్రేమ పేరుతో యువతిని వంచించిన వైసీపీ కార్యకర్త

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుకు చెందిన వైసీపీ కార్యకర్త ప్రేమ పేరుతో ఓ యువతిని వంచించాడు. ఈ అవమాన భారం తట్టుకోలేక ఆ యువతి ఎలుకలు మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆ యువతి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు.. ప్రత్తిపాడు తూర్పుపాలెంకు చెందిన కారసాల రాజారావు, అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నారు. పెళ్లి విషయమై ఆమె ఈనెల 15న రాజారావును నిలదీసింది. దీంతో రాజారావు నిన్ను పెళ్లి చేసుకోనని, చేతనైంది చేసుకోమని బెదిరించాడు. దీంతో బాధిత యువతి ఎలుకల మందు తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్ కు తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 562.40 అడుగులు ఉంది. ఇది 238.00 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 8550 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 280, ఔట్‌ఫ్లో వాటర్‌గా 28,466 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బెల్లంకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, లైసెన్స్ లేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చామని, అధికలోడుతో వెళ్తున్న వాహనాలకు అపరాధ రుసుం వసూలు చేశామని ఎస్‌ఐ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, సిబ్బంది ఎల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



● గురజాల పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో ఈ నెల 19న ఆదివారం గుంటూరుకు చెందిన కిమ్స్ శిఖర హాస్పిటల్ వారు డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. వివరాలకు 83097 13983 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

● మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగుల కింద రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల తనిఖీని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు తెలిపారు. పింఛన్ లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని కోరారు.

● రెంటచింతల మండలం మంచికల్లు, పాలువాయిగేట్, తుమ్మకోట, పశర్లపాడు, మల్లవరం, మిట్టగుడిపాడు, రెంటచింతల తదితర గ్రామాల్లో దివ్యాంగుల పింఛన్ల తనిఖీ బృందం శుక్రవారం పర్యటించనుంది. మొత్తం 19 మంది లబ్ధిదారులను ఆ బృందం తనిఖీ చేయనుంది.

● మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన దుర్గిలో ఈనెల 20వ తేదీ నుంచి ఒంగోలు జాతి పశు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సుబ్బమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్జీలు శ్రీనివాస కళ్యాణ్, ప్రశాంత్

కోర్టు ఉద్యోగిని మృతికి నివాళి

మాచర్లటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉద్యోగి పొనుగుపాటి సుబ్బమ్మ గత శుక్రవారం రాత్రి జొన్నలగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సందర్భంగా గురువారం బార్ అసోసియేషన్ హాల్లో సుబ్బమ్మ మృతికి నివాళిగా సంతాప సభ నిర్వహించారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) శ్రీరాం శ్రీనివాస కళ్యాణ్, అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్) ప్రశాంత్‌లు సుబ్బమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు పలువురు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అచ్చంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996 - 2001 మిలీనియం బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ ఆలింగనాలు, కరచలనాలు, పలకరింపులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా వారు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ బాలకృష్ణ, ఏడుకొండలు, గిరి, బాణావత్ సైదా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తా
- అసెంబ్లీ నుంచి పారిపోయిన వైసీపీ..
- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
- సర్వీస్ ప్రొవైడర్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే

మాచర్లటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్ట్ ఫస్ట్ ఫేజ్‌ను పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి విద్యారంగంలో నూతన ఒరవడి తీసుకొస్తామని, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో రూ. 117 కోట్లతో ప్రధానమైన నాలుగు రోడ్లను తీసుకొచ్చామన్నారు. అలాగే, తాళ్లపల్లిలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, రెంటచింతలలో గిరిజన సంక్షేమ హాస్టల్ మంజూరయ్యాయన్నారు. మాచర్ల పట్టణాన్ని అభివృద్ధిలో నడిపించి మోడల్‌గా తీర్చిదిద్దుతామని, పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. పట్టణంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి చేతి వృత్తుల వారికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. పురపాలక సంఘ రాష్ట్ర మంత్రి నారాయణతో మాట్లాడగా పట్టణాభివృద్ధికి సుముఖత వ్యక్తం చేశారన్నారు. వైసీపీ హయాంలో సిమెంట్ రోడ్లు వేయలేదని, మేజరు కాలువల్లో పూడికను తొలగించలేదని విమర్శించారు. ఇప్పుడేమో వైసీపీ నేతలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలు రోడ్లపై ధర్నాలు చేసే సమయంలో వారిని రోడ్లపైనే నిలిపి తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని నిలదీస్తామన్నారు. అబద్ధపు మాటలు, రాతలతో ప్రజలను గడుపుకోవడం వైసీపీ నేతలకే చెల్లిందన్నారు. ఏ వేదికపైన అయినా, ఏ అంశంపైన అయినా చర్చకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. అసెంబ్లీలో చర్చ వస్తుందని భయపడి అసెంబ్లీ నుంచి పారిపోయిన పార్టీ వైసీపీ అన్నారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగి ప్రజలు చనిపోతే రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ హయాంలో విద్యుత్‌చార్జీల పెంపు, రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ పథకాలు, పరికరాలు రద్దు గురించి ప్రస్తావిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



సర్వీస్ ప్రొవైడర్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యువత తల్లిదండ్రులపై ఆధారపడకుండా జీవించాలని, అవకాశాలను అందిపుచ్చు కోవాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మెప్మా ఆర్థికసాయంతో లోన్ పొందిన డ్వాక్రా మహిళలు ఇద్దరు పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసుకున్న షాపుని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, మున్నా రాంబాబు, అనిల్, వీరాస్వామి యాదవ్, పుల్లారావు, శాంతినాయుడు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి ..

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మాచర్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తాళ్లపల్లిలో నిర్వహించిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన మాచర్ల పెద్దారెడ్డి టీంకు రూ. 20 వేల నగదు, షీల్డ్‌ను గురువారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుండాల శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, నడ్డి పెద్దిరాజు, పసుపులేటి రోహిత్, పగడాల నాగేశ్వరరావు, జల్లెల కొండలు, బిట్టు లింగయ్య, నజీర్, బట్టు సత్యనారాయణ, సుబ్బారావు, పిచ్చయ్య, తీర్థాల నాసరయ్య, చల్లా గోవిందరాజు, నిర్వాహకులు బొక్కల శ్రీను, గాలి కోటేశ్వరరావు, పండు, ఈశ్వర్, సైదారావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేత టీంకి ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి16 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన క్రోసూరు, అమరావతి, అచ్చంపేట మండలాల ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక మొత్తంలో నిధుల కేటాయింపు జరిగిందన్నారు. సీసీ రోడ్లు, తారు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, గోకులం షెడ్లు వంటి అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా చూడాలన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో అమరా వతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల టీడీపీ అధ్యక్షులు మల్లాది విష్ణు, షేక్ చిన జాన్‌బాషా, నందిగామ ఆశీర్వాదం, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

బెడ్ రెస్ట్ పింఛన్ల పరిశీలన

గురజాలటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీ, మండల పరిధిలోని పూర్తి బెడ్ రెస్ట్ పింఛన్లను గురువారం ప్రభుత్వ వైద్యుల బృందం పరిశీలించింది. నేరుగా లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్ పొందుతున్న వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారి సర్టిఫికెట్లను పరిశీలించి బయోమెట్రిక్ తీసుకున్నారు. మండలంలో బెడ్‌రెస్ట్ పింఛన్లు 17 ఉన్నాయి. ఇందుకు సంబంధించిన నివేదికను డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపనున్నట్లు వైద్యుల బృందం తెలిపింది. ఈ పరిశీలనలో గురజాల కమిషనర్ శివన్నారాయణ, కృష్ణా జిల్లా వైద్యులు కేవీ సత్యనారాయణ, కే నాగార్జున, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి): మంచంలో కదలలేని స్థితిలో ఉండి పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుల గృహాలకు గురువారం వైద్యుల బృందం వెళ్లి పరిశీలించింది. వారి సర్టిఫికెట్లను పరిశీలించి నమోదు చేసుకున్నారు. మండలంలో 24 పెన్షన్లు ఉండగా అందులో ఒకరు మరణించారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ. 15 వేలు పెన్షన్ అందుతోంది. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వైద్యుల బృందం తెలిపింది. ఈ బృందంలో గుంటూరు జీజీహెచ్ డాక్టర్ గోపీకృష్ణ, కైకలూరు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసరావు, మండల మెడికల్ ఆఫీసర్ బీ శ్రీరాం, ఎంపీడీవో ప్రసాద్ ఉన్నారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మంచానికే పరిమితమై పింఛన్లను పొందుతున్న వారిని గురువారం వైద్యుల బృందం పరిశీలించింది. మండలంలో 31 పింఛన్లు ఉండగా వీరంతా రూ. 15 వేలు పింఛన్లు పొందుతున్నారు. పరిశీలనలో కైకలూరు వైద్యులు శ్రీనివాస్, గోపీకృష్ణ, దుర్గి డాక్టర్ భానుప్రకాష్, ఎంపీడీవో శివప్రసాద్, వెలుగు సీసీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో దివ్యాంగుల పింఛన్ల తనిఖీని గురువారం చేపట్టారు. కార్యక్రమంలో తనిఖీ బృందంతో పాటు ఎంపీడీవో రామకృష్ణ, డాక్టర్ ఆదిత్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెదకూరపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన అనుముల రాములు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన భార్య సామ్రాజ్యంనకు గురువారం చేనేత పద్మ శాలి బంధువు ద్వారా సేకరించిన విరాళం రూ.28,300 అందజేశారు. జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం, గౌరవ అధ్యక్షుడు అనుముల వెంకటరావులు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్, పాపారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

సత్తెనపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా నిస్తోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు గురువారం ఆయన చెక్కులను అందజేశారు. రాజుపాలెం మండలం అనుపాలెంకు చెందిన చింతా శేషగిరికి రూ 1.62 లక్షలు, ఇనిమెట్లకు చెందిన తుండు కోమలిదేవికి రూ.2,24,100, సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళకు చెందిన తోట రమాదేవికి రూ.51,500, కంటెపూడికి చెందిన దేవినేని కృష్ణారావుకు రూ.74,687, పాకాల పాడుకు చెందిన కొతారు శ్రీనివాసరావుకు రూ.2 లక్షలు, సత్తెనపల్లికి చెందిన కొత్త సాంబశివారెడ్డికి రూ.1.20 లక్షలు, పిన్నెబోయిన భాస్కర్‌కు రూ.1,09,600, రాయుడు సుబ్బారావుకు రూ.81 వేలు, చీమలమర్రికి చెందిన కంకణంపాటి కోటేశ్వరరావుకు రూ 37,983, మాదలకు చెందిన ఎస్ ప్రసాదుకు రూ.74,687, ఇరుకుపాలెంకు చెందిన తులవర్తి వెంకట నారాయణకు రూ.81 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మొక్కపాటి రామచంద్రరావు, పల్లపాటి పెద్దిరాజు, ఆతుకూరి నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, పచ్చ సుధీర్, ఎంపీ చలపతిరావు, కోమటినేని శ్రీనివాసరావు, బత్తుల వెంకటస్వామి, అబ్దుల్ ఖాజా పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే కన్నా

కనుమూరికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి రూ. లక్ష చెల్లించి ఎమ్మెల్యే కన్నా కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వం కోటి దాటడం అభినందనీయమన్నారు. కుంకలగుంటలో 2,063 మందిని పార్టీ సభ్యత్వాలు తీసుకునేలా చేశామన్నారు.

విద్యుత్ శాఖ తనిఖీలు

సత్తెనపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విద్యుత్‌శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సీహెచ్ రామ్ బొట్ల, కే రవికుమార్ పర్యవేక్షణలో 47 బృందాలు పట్టణంలోని 3,444 సర్వీసులు తనిఖీ చేశాయి. వాటిలో అనుమతించిన కేటగిరి కన్నా వేరే కేటగిరిలో ఒకరు, అనుమతించిన లోడు కన్నా ఎక్కువలోడు వాడుతున్న 149 మంది విద్యుత్ వినియోగదారులను గుర్తించారు. వీరందరికీ రూ.6,57,000 అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో విద్యుత్ శాఖ అధికారులు రాజశేఖర్, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాదరావు, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక లాభాలు

మాచవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ దిగుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని మండల వ్యవసాయ శాఖాధికారిణి రామమ్మ రైతులకు సూచించారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో గురువారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని మిర్చి, కంది పంటలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

గురజాలటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. దాచేపల్లి మండలం తక్కెళ్లపాడుకు చెందిన పినబోయిన నాగమణి (28) సంక్రాంతి పండుగకు తన పుట్టిల్లు అయిన మండలంలోని గొట్టిముక్కల గ్రామానికి వెళ్లింది. గురువారం రాత్రి తన తమ్ముడు పర్వతాలుతో కలిసి అత్తగారిల్లు అయిన తక్కెళ్లపాడుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. మార్గ మధ్యంలోని దైద సమీపంలోకి రాగా నాగమణి వాహనం పైనుంచి జారి కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయమైంది. వెంటనే గురజాల పట్టణ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త నరసింహారావు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఫాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

కోసూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఫాస్టర్లకు గౌరవ వేతనాన్ని పునరుద్ధరించాలని క్రోసూరు ఫెలోషిప్ ఫాస్టర్ల సంఘం అధ్యక్షుడు ఇంకొల్లు సుబ్బారావు డిమాండ్ చేశారు.మండలంలోని ఎర్రబాలెంలో గురువారం ఫాస్టర్ల సంఘ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఫాస్టర్లకు రూ. 5వేలు గౌరవ వేతనం ఇచ్చేవారని, 6 నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పౌలు, కార్యదర్శి జడ నాగరాజు, కోశాధికారి రాజారత్నం, సీహెచ్ శ్యామ్‌సన్ పాల్గొన్నారు.

చామర్రు మృతుల మరణం
మద్యం వలన కాదు

● క్రోసూరు సీఐ తులసీ వెల్లడి

కోసూరు, జనవరి16(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అచ్చంపేట మండలం చామర్రులో ఇద్దరి వ్యక్తుల మరణాలు మద్యం తాగడం వలన సంభవించినవికావని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టీ తులసీ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. చీమర్రు గ్రామానికి చెందిన గౌతుకట్ల నాగేశ్వరరావు, తెల్లమేకల నాగేశ్వరరావు మరణాలపై తాము పూర్తిస్థాయి విచారణ చేపట్టామని, నాగేశ్వరరావులు వారి బంధువు అంత్యక్రియల్లో పాల్గొన్నారని, అనంతరం అనారోగ్యానికి గురై వాంతులు, విరోచనలకు గురయ్యారని, మృతి చెందే ముందు వారి నోటి నుంచి నురగ రావటం, కడుపునొప్పి, వాంతులు, విరోచనలు అయినట్టు తమ విచారణలో తేలిందన్నారు. మృతులు తీసుకున్న మద్యం, కూల్‌డ్రింక్, ఆహారంలో ఏం కలిసిందనేది ఇంకా నిర్ధారణ కాలేదన్నారు. మృతుల మరణాలకు మద్యం ఎట్టి పరిస్థితుల్లో కారణం కాదని ఆమె తెలిపారు. ఈఘటనపై అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారని, సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నివేదిక రాగానే అసలు కారణాలు తెలుస్తాయని ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు.



మరమ్మతుల అనంతరం సత్రశాల రహదారి

సత్రశాల రహదారి మరమ్మతులు పూర్తి

రెంటచింతల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్రశాలకి వెళ్లే రహదారికి చేపట్టిన మరమ్మతు పనులు పూర్తయ్యాయని ఆర్‌అండ్‌బీ ఏఈఈ యూసఫ్ తెలిపారు. గురువారం ఆయన సత్రశాల రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లడుతూ.. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు సత్రశాల రహదారి మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేశామన్నారు. నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతు పనుల్లో భాగంగా నియోజకవర్గానికి రూ.117.70 కోట్లు మంజూరు కాగా, రెంటచింతల మండలంలో రూ.1.33 కోట్లతో పనులుచేపట్టామన్నారు. అయితే రెంటచింతల పట్టణంలోని ప్రధాన రహదారి జాతీయ రహదారుల జాబితాలో ఉండడం వలన మరమ్మతులు తమ శాఖ చేపట్టలేదని యూసఫ్ తెలిపారు.

ఆయుర్వేద వైద్యశిబిరం విజయవంతం

బెల్లంకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం బెలంకొండ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఆయుర్వేద వైద్యశిబిరం విజయవంతమైందని ఆయుర్వేద వైద్యులు శ్రీనివాసరావు తెలిపారు. 115 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆయర్వేద ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పైరు ధ్వంసం

● పరిశీలించిన జనసేన నేతలు

కారంపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరుని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన కారంపూడి మండలంలోని పెదకొదమగుండ్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాడా రామకృష్ణ ఎకరంన్నర పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలను పీకేశారు. గురువారం పొలానికి వెళ్లిన రామకృష్ణ పంట ధ్వంసమై ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ధ్వంసమైన పంటను పరిశీలించి కేసు నమోదు చేశారు. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు రామకృష్ణ తెలిపాడు.



ధ్వంసమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రామాంజినేయులు తదితరులు

నిందితులను కఠినంగా శిక్షించాలి .. పంట ధ్వంసానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు డిమాండ్‌చేశారు. గురువారం ఆయన ధ్వంసమైన పైరుని పరిశీలించారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): పైరు ధ్వంసానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

సురక్షిత ప్రయాణమే మేలు

● రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పిడుగురాళ్ల ఎంవీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు

పిడుగురాళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణమే తమ కుటుంబానికి మేలనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తుంచుకోవాలని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. రాంబాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం ఎంతో ప్రమాదకరమని, ముఖ్యకూడళ్లలో తగిన జాగ్రత్తలు పాటించాలని వాహనదారులకు సూచించారు. డిపో మేనేజర్ పీ కోటేశ్వరనాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామని, తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత పట్ల డ్రైవర్లు జాగ్రత్తలు తీసు కోవాలని పిడుగురాళ్ళ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆర్టీసీ గ్యారేజ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రోడ్డు అతివేగం, ఓవర్ టేక్‌ల వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ ఫాతిమా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడుగురాళ్ల ఎంవీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

గోశాలకు రూ.80వేల విలువైన పశుగ్రాసం వితరణ

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం నిర్వహణలోని గోశాలకు తెనాలికి చెందిన కత్తుల సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులు పశుగ్రాసాన్ని వితరణ చేశారు. సుమారు రూ.80వేల విలువైన ఐదు ట్రక్కుల గడ్డిని గోశాలకు దాతలు అందజేసినట్లు ఆలయ ధర్మకర్త సూదా సాంబశివరావు తెలిపారు. గోశాలలోని గోవులకు ఏడాది పొడవునా సరిపోయేలా గడ్డిని అందించి తోడ్పాటు అందించారన్నారు. గోవులకు పశుగ్రాసాన్ని అందించిన సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులకు ధర్మకర్త సాంబశివరావు, గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఏవోగా వరలక్ష్మి బాధ్యతల స్వీకారం

వినుకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మండల వ్యవసాయాధికారిగా వరలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఫర్టిలైజర్స్ యజమానులతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో ఏవోగా పనిచేసిన అంజిరెడ్డి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించాడనే ఆరోపణలపై వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీచేసి ఆయన స్థానంలో వరలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు. నరసరావుపేట భూ పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మిని వినుకొండ ఇన్‌చార్జి ఏవోగా నియమించారు. గతంలో ఆమె వినుకొండ వ్యవసాయశాఖాధికారిగా పనిచేసిన అనుభవం ఉండడంతో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు రైతులు, వ్యాపారులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

అంతర పంటలతో అధిక ఆదాయం: సైదయ్య

ఈపూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకుడు సైదయ్య అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులోని ప్రకృతి వ్యవసాయం ద్వారా కంది, మొక్క జొన్నలో అంతర పంటలుగా సాగుచేసిన చిక్కుడు, కీరదోస, మినుము, పెసర, దోస పంటలను గురువారం నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సభ్యురాలు ఉష, శిక్షకుడు సైదయ్య పరిశీలించారు. అంతర పంటలు సాగు చేయడం వలన చీడపీడల బారిన పడకుండా పంటలను రక్షించుకోవచ్చునన్నారు. అదేవిధంగా ఒకే భూమిలో అనేక రకాలైన పంటలను సాగు చేయడం వలన భూమి సారవంతంగా ఉంటుందన్నారు. వారితో పాటు రైతులు బాస్కరరావు, ఏడుకొండలు, తిరుపతిరావు, ప్రకాష్‌రావులు పాల్గొన్నారు.

21న జరిగే ఏఐవైఎఫ్ మహాసభను జయప్రదం చేయాలి: సుభానీ

వినుకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీన వినుకొండలో జరిగే ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ సుభానీ గురువారం పిలుపునిచ్చారు. స్థానిక శివయ్యభవన్‌లో శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర 22వ మహాసభను పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన జరిగే జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను భర్తీ చేయాలని, అమరావతి రాజధానిని ఫ్రీ జోన్‌గా చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు షేక్ గౌస్, ఖాశిం, మరియబాబు, మనోహర్, అభిషేక్, యున, లాజర్ మాచర్ల ఏరియా కార్యదర్శి రంగస్వామి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

బొందిలిపాలెం (శావల్యాపురం) జనవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించినపుడే వారు క్రీడలలో బాగా రాణించి ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఎస్‌వీకేకే టెక్నాలజీస్ అధినేత సోమేపల్లి నాగేశ్వరరావు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలలో చిన్నకంచెర్ల, శానంపూడి, మతుకుమల్లి గ్రామస్థులు గెలుపొందారు. ముగ్గుల పోటీల్లో బొందిలిపాలెం మహిళలు చింతా మీనాక్షి, తేళ శ్రావణి, చల్లగుండ్ల స్వాతి, బిక్కి రమాదేవిలు గెలుపొందారు. పోటీల్లో ప్రథమస్థానం సాధించిన విజేతలకు ఎస్‌వీకేకే టెక్నాలజీస్ అధినేత నాగేశ్వరరావు రూ.3వేల చొప్పున నగదు బహుమతిని అందజేసి అభినందించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గరిమిడి శ్రీనివాసరావు, ఒత్తుల వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల రాజశేఖర్, ముంద్రు రామారావు, శింగారావు, చింతా వెంకట్రావు, రసపుత్ర రాంబాలాజీసింగ్ పాల్గొన్నారు.

భార్యను నరికిన భర్త

బాపట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి నిత్యం భార్యతో గొడవ పడటమే కాకుండా నిద్రపోతున్న భార్యను గొడ్డలితో నరికి గాయపరిచిన సంఘటన బాపట్లలో జరిగింది. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని కాకుమానువారిపాలెంకు చెందిన తమటం నాగమల్లేశ్వరి భర్త సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగి తరుచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. గురువారం ఉదయం ఇంట్లో నిద్రపోతున్న భార్యను గొడ్డలితో విచక్షణా రహితంగా నరికాడు. గాయపడిన ఆమె ఆసుపత్రిలో చేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిలిచిన పీహెచ్‌సీ నిర్మాణ పనులు

● పశువుల కొష్టంగా మారిన వైనం
● నిర్మాణాన్ని పూర్తిచేయాలని పలువురి విజ్ఞప్తి

వినుకొండ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకనకొండలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన హెల్త్ సెంటర్ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య అవసరాలను తీర్చేందుకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వల్లెం పుల్లమ్మ, మున్సూప్ వల్లెం వెంకటేశ్వర్లు దంపతులు ప్రజా అవసరాల కోసం, గ్రామ అవసరాల కోసం 1.50 ఎకరాల భూమిని ప్రభుత్వానికి విరాళంగా అందజేశారు. భూమిలో నేటి సర్పంచ్ వల్లెం శ్రీనివాసరావు సహకారంతో సుమారు రూ.50లక్షలతో జాతీయ ఉపాధి హామీ నిధుల నుంచి రైతు సేవా కేంద్రంతోపాటు ప్రాథమిక వైద్యశాల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. శ్లాబ్ లెవల్‌కు పనులు పూర్తయిన తర్వాత అర్థాంతరంగా పనులు నిలిచిపోవడంతో అవి నిరుపయోగంగా మారి పశువుల కొష్టాలుగా మారాయి. అధికారులు స్పందించి అర్థంతరంగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రంతోపాటు, ప్రాథమిక హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


పశువుల కొష్టంలా మారిన నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం

ఎన్‌ఆర్‌ఐలు సొంత గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో స్థిరపడిన వారు సొంత గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. అది పీ4 విధానంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పేదరికం లేని రాష్ట్రాన్ని సాధించి చూపిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ దిశగానే కూటమి ప్రభుత్వం చర్యలు ఉండబోతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యులు కావాలని సీఎం పిలుపునిచ్చారని, అందుకు స్పందించి, సహకరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం వెల్లడించిన వివరాలపై ఈమేరకు ఆయన స్పందించారు. ఒక్కసారి అమరావతి పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ మించిన గ్రోత్ ఇంజన్ అవుతుందని, దేశంలో అతిపెద్ద మెట్రో పాలిటన్ రీజియన్‌లలో అది ఒకటిగా నిలుస్తుందన్నారు. ప్రజా రాజధానిని ఐదేళ్ల పాడుపెట్టిన జగన్ కారణంగా నిర్మాణ వ్యయం పెరగం తప్ప రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరికి ఎంతో కొంత తిరిగి ఇచ్చిన వారే నిజమైన శ్రీమంతుడు అవుతారని, ఆదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి ఎవరికి తోచినస్థాయిలో వారు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ స్వప్నం సాకారంలో భాగంగా ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలంటే ఉపాధి అవకాశాలు పెరగాలని, ఆదిశగానే కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రణాళికలు రచించిందని, ప్రైవేటురంగం నుంచి కూడా అందుకు సహకారం లభించాల్సి ఉందన్నారు. ఇతర ప్రాంతాల్లో , విదేశాల్లో స్థిరపడిన స్థానికులు ఆదిశగా ముందుకు రావాలని జీవీ పిలుపునిచ్చారు.

వెంచర్లను ప్రోత్సహిస్తాం

● నిబంధనలు అతిక్రమిస్తే అనుమతులు రద్దు
● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రాంతంలో వెంచర్లను ప్రోత్సహిస్తామని, ఎవరూ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి గురువారం ఆయన సందర్శించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్కృతి సంప్రదాయాలను ఉట్టి పడేలా ముగ్గులు పోటీల్లో మహిళలు పాల్గొనడం ఆనందదాయకమని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు కుటుంబ ఐక్యతను చాటి చెబుతాయన్నారు. వెంచర్లలో తప్పనిసరిగా మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. వినుకొండ ప్రాంతంలోని త్వరలో నూతన పాలిటెక్నిక్ కాళాశాల, వెటర్నీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన పార్టీ నాయకులు నాగ శ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావు. బీజేపీ పార్టీ నాయకులు యార్లగడ్డ లెనిన్, వాసిరెడ్డి లింగమూర్తి, ఉషారాణి, న్యాయవాదులు రామకోటేశ్వరరావు, సైదారావు, ఆయూబ్‌ఖాన్, షమీమ్, తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేస్తున్న చీఫ్‌విఫ్ జీవీ, మక్కెన, నిర్వాహకులు వాసిరెడ్డి లింగమూర్తి

ఆర్‌ఎంపీ రాంబాబు మృతి

శావల్యాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీగా మండల ప్రజలకు సుపరిచితులైన శావల్యాపురానికి చెందిన రావిపాటి రాంబాబు (70) గుండెపోటుతో గురువారం మృతిచెందారు. రాంబాబు తండ్రి కోటేశ్వరరావు కూడా ఆర్‌ఎంపీగా సేవలందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంబాబు చేతికి గాయమై చికిత్స పొందుతూ గురువారం ఉదయం గుండెపోటుకు గురయ్యారు. శావల్యాపురంలో శుక్రవారం అంత్యక్రియలు జరగనున్నాయి.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జగనన్న కాలనీల్లో అక్రమాలపై
చర్యలు తీసుకోవాలంటూ ప్రజా సంఘాల ధర్నా

వినుకొండ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా నాయక్‌తోపాటు పీడీఎం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెల్లటూరు రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ పేరుతో సెంటు చొప్పన కొందరికి పట్టాలు పంపిణీ చేశారని, సెంటుకు పట్టా పొందిన వారిలో ఎక్కువమంది అనర్హులుగా ఉన్నారని, సెంటు పట్టా పొంది రెండు నుంచి నాలుగు సెంట్లు అనధికారికంగా నిర్మాణాలు చేపట్టారని, ఇప్పటికైనా వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇళ్ళులేని ఎస్సీ, ఎస్టీలకు ఆ ప్రాంతంలో పట్టాలు పంపిణీచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతంలో జగనన్న కాలనీలో జరిగిన అక్రమాలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులుచేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా అనర్హులుగా గుర్తించి అర్హులకు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, బీసీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఏడుకొండలు నాయక్, బికారి నాయక్, శంకర్‌నాయక్, వెంకటరావు, అంజలీబాయి, వేముల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

● సినీ నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణ


పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేస్తున్న సినీ నటుడు చిట్టినేని

యడ్లపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి సంస్కృతీ, సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీక అని సినీ నటుడు, రచయిత చిట్టినేని లక్ష్మీనారాయణ అన్నారు. సినీ నటుడు, వేదిక అధ్యక్షుడు మత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులో రెండు రోజులపాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలతోపాటు మ్యూజికల్ చైర్స్, మోకులాగుట, లెమన్ స్పూన్, స్కిప్పింగ్, బక్కెట్‌బాల్ అంశాలలో పోటీలను నిర్వహించారు. పోటీలలో పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. మూడో రోజైన బుధవారం రాత్రి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇలాంటి సంప్రదాయ పోటీలు సంక్రాంతికి మరింత శోభను ఇస్తాయన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా సంబరాలు జరుపుతున్న సురేష్‌బాబు, అరుణకుమారి దంపతులు అభినందనీయులన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అంతేగాకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో గుంటూరు కళాపరిషత్ అధ్యక్షుడు ఆలోకం పెదబ్బయ్య, డాక్టర్ భార్గవి చౌదరి, ఆరెకపూడి వృద్ధి, ముత్తవరపు రామారావు, ఎం.కృష్ణమూర్తి, జరుగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


రహదారి భద్రతా బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యువకులందరూ రహదారి భద్రతా నియమాలు పాటించి వాహనాలను నడపాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాల బ్యానర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రమాదాల బారినపడి చనిపోతున్నారని, కొంత మంది యువకులు వికలాంగులుగా మారుతున్నారని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి జీ సంజీవ్‌కుమార్, ఎంవీఐ శివ నాగేశ్వరరావు, ఎమ్ మనీషా, వంశీ కృష్ణ, ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల అర్హతలపై తనిఖీ


వెల్లటూరులో పింఛన్ పొందుతున్న లబ్ధిదారుడితో మాట్లాడుతున్న వైధికారులు

బొల్లాపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పింఛనుదారుల అర్హతలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారులు, బొల్లాపల్లి ఎంపీడీవో సీతారామయ్య, ఏపీఎం పీ రంగారెడ్డిలు ఫేజ్-1లో భాగంగా మంచానికి పరిమితమై రూ.10వేలు, రూ.15 వేలు పొందుతున్న పింఛన్‌దారులను విచారించారు. విచారణలో భాగంగా విజయవాడ, గుంటూరు ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ పీ వరుణ్ కుమార్, డీ రోశయ్యల ఆధ్వర్యంలో మండలంలోని 16మంది పింఛన్‌దారులను వారి ఆరోగ్య పరిస్థితులను తనిఖీచేసి వారిని విచారించారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయటం జరుగుతుందన్నారు. వారి వెంట వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు కే శ్రీను, డీ సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండల పరిధిలో వేలూరులో 10మంది, కావూరులో 8మంది నెలకు రూ.15వేల చొప్పున పెన్షన్లు పొందుతున్నారు. వారి అర్హతలపై గురువారం డాక్టర్ల బృందం పరిశీలన జరిపినట్లు చిలకలూరిపేట ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో తనిఖీలు జరుగుతాయని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వీఆర్వో మృతి చెందాడు. కొల్లూరు మండలం చింతల్లంక గ్రామానికి చెందిన తోడేటి రత్నాకర్ (42) భట్టిప్రోలు మండలం ఐలవరంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ ఎం శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బగళాముఖిని దర్శించుకున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

పిట్టలవానిపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందోలులోని బగళాముఖి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో జస్టిస్ శివశంకర్‌కు వేద ఆశీర్వచనం నిర్వహించి అమ్మవారి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ జెండా, ఫ్లెక్సీలు తొలగించిన అనంతరం పంచాయతీ కార్యాలయం

పంచాయతీ కార్యాలయంపై వైసీపీ జెండా తొలగింపు

● అధికారుల తీరుపై జీవీ ఆగ్రహం

వినుకొండ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకుపాలెం పంచాయతీ కార్యాలయంపై ఏర్పాటుచేసిన వైసీపీ జెండాను ఎట్టకేలకు అధికారులు గురువారం తొలగించారు. ప్రభుత్వ కార్యాలయంపై వైసీపీ జెండా అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వినుకొండ ఈవోపీఆర్డీ సుందరరెడ్డి కార్యాలయంపై ఉన్న జెండాను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరి అనుదీప్తి సిబ్బంది సాయంతో పంచాయతీ కార్యాలయంపై ఏర్పాటుచేసిన జెండాతోపాటు కార్యాలయం ముందు భాగంలో ఉన్న పార్టీల బ్యానర్లను, ఫ్లెక్సీలను తొలగించారు. పంచాయతీ కార్యాలయంపై వైసీపీ జెండా ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు ఇంతకాలం ఎందుకు పట్టించుకోలేదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సత్వరం స్పందించి జెండాతో పాటు ఫ్లెక్సీలను తొలగించారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిగురుపాటి శ్రీనివాసరావు, అనిత

పేదలకు దుప్పట్లు పంపిణీ

రొంపిచర్ల, జనవరి 16 (ఆంధ్రజోతి): మండలంలోని పరగటిచర్లలో పేదలకు బుధవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. కామినేని వెంకట రమాదేవి జ్ఞాపకార్థం ఆమె భర్త కామినేని వెంకట రంగారావు వంద మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. చిగురుపాటి శ్రీనివాసరావు, అనిత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రామయోగిస్వామి తిరునాళ్ళ

నూజెండ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నూజెండ్లలో రామయోగి స్వామి తిరునాళ్ళ వైభవంగా గురువారం జరిగింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని గ్రామస్థులు మూడు భారీ విద్యుత్ ప్రభలు నిర్మించి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరునాళ్ళ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.